కళాకారులకు ఆదరణేది?

- కుటుంబ పోషణ భారమై వీధిన పడిన వైనం
- పట్టించుకోని ప్రభుత్వం
- ఆందోళనలో 250 మంది కళాకారులు



కర్నూల్‌లో నాటక ప్రదర్శన చేస్తున్న పెద్దగడ కళాకారులు



పెబ్బేరులో నాటక ప్రదర్శన చేస్తున్న కళాకారులు

చిన్నంబావి: ఒకప్పుడు రాష్ట్రంలో కళాకరులకు ప్రత్యేక గుర్తింపు ఉండేది. ప్రస్తుతం ఆధునిక పోకడలకు ప్రాచీన కళలు అంతరించిపోతున్నాయి. ప్రభుత్వాలు కూడా సరైన ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో కళాకారులు వీధిన పడుతున్నారు.

కళాకారులపై నిర్లక్ష్యం

మండలంలోని పెద్దదగడలో 30మందికి పైగా సీనియర్ నాటక, కొప్పునూరులో 15మంది పౌరాణిక కళాకారులు ఉన్నారు. వివిధ గ్రామాల్లో కలిపి 120మంది యక్షగాన కళాకారులు ఉండగా.. కొప్పునూరులోనే 110మంది ఉన్నారు. మండలంలో మొత్తం సుమారు 250మంది కళాకారులు తమ కళలతో సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పౌరాణిక గాథలకు జీవం పోశారు. కానీ సినీరంగంపై ప్రభుత్వాలు చూపుతున్న శ్రద్ధ సంప్రదాయ కళాకారులపై చూపకపోవడంతో వారి జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయి.

తగ్గుతున్న ఆదరణ

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు, టీవీల కారణంగా సినిమాలు, సీరియల్స్ తదితర వాటికి అలవాటు పడ్డ ప్రజలు వీధి నాటకాలపై ఆసక్తి చూపడం లేదు. దీంతో కళలకు ఆదరణ తగ్గిపోవడంతో గతంలో వాటినే ఆసరాగా చేసుకొని జీవనం నెట్టుకొచ్చిన కళాకారులు నేడు దైన్యస్థితిని అనుభవిస్తున్నారు. ఏదైనా ప్రత్యేక కార్యక్రమాలు, పండుగల వేళ సాంస్కృతిక కళల గురించి, కళాకారులకు సన్మానం తదితర కార్యక్రమాలను ఆర్భాటంగా జరిపే ప్రభుత్వాలు మరుసటి రోజు నుంచే కళాకారులను చిన్న చూపు చూస్తున్నాయని వారు వాపోతున్నారు.

సొంత ఖర్చులతో..



ప్రాచీన కాలం నుంచి వస్తున్న ఇతిహాసాలు, రామాయణం, మహాభారతం వంటి వంటిపై ఆసక్తి ఉండటంతో పౌరాణిక నాటక ప్రదర్శనను నేర్చుకున్నా. ఇప్పుడు వాటికి ఆదరణ తగ్గడంతో దాతల సహకారం, కొంత మేము సొంత ఖర్చు పెట్టి ప్రదర్శనలు చేస్తున్నాం.

– శంకర్‌యాదవ్

ప్రోత్సాహం లేదు



ఆధునిక యుగంలో నాటక ప్రదర్శనకు ఆదరణ తగ్గింది. గ్రామాల్లోని దాతల సహకారంతో నేటికీ ప్రదర్శనలు ఇస్తున్నాం. ప్రభుత్వం ప్రోత్సహిస్తే నాటక రంగాన్ని బతికించుకోవడానికి కష్టపడతాం.

– చనమోని గంగయ్య, పౌరాణిక నాటక కళాకారుడు

పింఛన్ ఇవ్వాలి



నాటకరంగం మీద ఆధారపడి బతుకుతున్నాం. కానీ కళలు ఆదరణ తగ్గడంతో పూట గడవడం కష్టంగా మారింది. ప్రభుత్వం స్పందించి 50 ఏళ్ల వయస్సు నిండిన కళాకారులను గుర్తించి రూ.3వేలు ఫింఛన్ అందించాలి.

– పూజారి బాలస్వామి, పెద్దగడ

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



కొత్తకోట: పట్టణ కేంద్రానికి చెందిన అన్నదమ్ములు మురళి, ఊషన్న వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్థానిక ప్రజల దాహార్తి తీర్చేందుకు అపోలో ఫార్మసీ ఎదురుగా చలివ్రేందం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురువారం నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి చలివేంద్రం ప్రారంచారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, బీచుపల్లి, శేఖర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, డాక్టర్ పీజే. బాబు, మోహన్‌రెడ్డి, బాల్‌రాజు, మాసన్న తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని వినతి



వీపనగండ్ల: ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ గురువారం మండల కేంద్రానికి చెందిన అందూరుకొండ చంద్రశేఖర్‌శెట్టి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వరలక్ష్మికి ఒక వినతిపత్రం అందజేశారు. సొంత ఇల్లు లేకపోవడంతో కిరాయి ఇంట్లో ఉంటూ జీవనాన్ని సాగిస్తున్నానని, అంధత్వం కారణంగా ఎలాంటి పని చేసుకోలేకపోతున్నానని వాపోయారు. అధికారులు, అన్ని పార్టీల రాజకీయ నాయకులు తనకు స్థలం, ఇల్లును ఇప్పించాలని ఆయన ఆ విజ్ఞాపన పత్రంలో కోరారు.

ప్రమాదవశాత్తు రెండు బైక్‌లు దగ్ధం

చిన్నంబావి: ప్రమాదవశాత్తు మంటలంటుకొని రెండు బైక్‌లు దగ్ధమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన గోవిందు, ఎర్రన్న తమ గొర్రెలను మేపేందుకు మండలంలోని బెక్కం గ్రామనికి వచ్చారు. గురువారం పంట పొలాల్లో బైక్‌లను ఉంచి గొర్రెలను మేపేందుకు వెళ్లారు. ఘటన స్థలానికి కొంత దూరంలో పంట వ్యర్థాలను కాల్చడంతో ప్రమాదవశాత్తు బైక్‌లకు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధం అయ్యాయి. ఈ మంటల్లో గొర్రెల కాపరులకు చెందిన వలలు సైతం కాలిపోయాయని, తమను ఆదుకోవాలని బాధితులు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్

గోపాల్‌పేట: చోరీ కేసులో గురువారం ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించామని గోపాల్‌పేట ప్రొహిబిషన్ ఎస్ఐ నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బుద్దారం గ్రామంలో ఇటీవల ఓ ఇంట్లో చోరీ జరిగింది. గురువారం ప్రొహిబిషన్ ఎస్ఐ నరేష్ గోపాల్‌పేట మండల కేంద్రంలోని కోదండరామస్వామి ఆలయ ప్రాంతంలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా బుద్దారంలో బుధవారం అర్జునయ్య ఇంట్లో తామే దొంగతనం చేశామని ఒప్పుకున్నారు. వారి నుంచి దొంగిలించిన సొమ్మును జప్తు చేసి నిందితులు బింగి శ్రీకాంత్, మండ్ల నరేష్‌ను రిమాండ్‌కు తరలించామని వివరించారు. ఈ ఇద్దరిపై గతంలో కూడా చోరీ కేసులు ఉన్నాయని తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు రైతులు సహకరించాలి



వీపనగండ్ల: కొనుగోలు కేంద్రాల్లో రైతులు సహకరిస్తేనే వరి ధాన్యం కొనుగోలు చేయడం వేగంగా పూర్తవుతుందని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం పుల్గర్‌చర్లలో ధాన్యం విక్రయంలో రైతులు పాటించాల్సిన పలు నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. సన్నరకం ధాన్యంలో 14 శాతం, దొడ్డు రకంలో 17 శాతం తేమ ఉండాలని, వాటిని మాత్రమే కొనుగోలు చేసేందుకు వీలు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం బిచ్చన్న, గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు మోహన్‌కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

చదువుతోపాటు వ్యాయామం అవసరం



విద్యార్థులను సన్మానిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవడంతో పాటు క్రీడలు, వ్యాయామంపై శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి సూచించారు. గురువారం ఇటీవల వెలువడిన పది, ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టరేట్ సమావేశ మందిరంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా నుంచి అమ్మాయిలు ఉత్తీర్ణత శాతం, అధిక మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ముగ్గురు గిరిజన అమ్మాయిలు జేఈఈ మెయిన్స్‌కు ఎంపికవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇది ఆరంభం మాత్ర మే అని భవిష్యత్‌లో చదువుతో పాటు వ్యాయామం, క్రీడల్లో పాల్గొంటూ విజ్ఞానంతో పాటు ఆరోగ్యాన్ని సమపార్జించుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెమెంటోతో పాటు వారికి ఉపయోగపడే ఏపీజే అబ్దుల్ కలాం రాసిన ఇగ్నేటెడ్ మైండ్స్ పుస్తకం బహుకరించారు. కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్‌ఘనీ, డీఐఈఓ అంజయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో వనపర్తి పదో తరగతి ఉత్తీర్ణత శాతంలో 29వ స్థానానికి పడిపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం 9వ తరగతిలో గణితంలో వెనుకబడి ఉన్న విద్యార్థుల జాబితా సేకరించి జూన్ 12 నుంచి నెల రోజులపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. వచ్చే 10వ తరగతి వార్షిక పరీక్షల్లో ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ కావడానికి వీలు లేదని, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకొని విద్యార్థులకు తగిన రీతిలో బోధించాలన్నారు. విద్యార్థులు ఫెయిల్ అయితే సంబంధిత సబ్జెక్ట్ ఉపాధ్యాయుడు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

బాలల రక్షణకు చర్యలు



ఖిల్లాఘనపురం: మైనర్ బాలబాలికలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వార సలహాలు, సూచనలు ఉచితంగా అందిస్తున్నామని సంస్థ వలంటీర్ అహ్మద్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాల పోస్టర్‌ను గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్ బాలబాలికలతో పాటుగా వృద్ధులకు ఈ సంస్థ ద్వారా న్యాయ సలహాలు అందిస్తామన్నారు. ఇందుకోసం న్యాయ సేవాధికార సంస్థ నుంచి 8 మంది న్యాయవాదులు, 10 మంది పారా లీగల్ వలంటీర్లు ఉన్నారని చెప్పారు. బాలబాలికలపై ఎవరైనా వేధింపులకు పాల్పడితే వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

ఆత్మకూర్: పాకిస్తాన్ ముష్కరులపై విజయవంతంగా జరిపిన ఆపరేషన్ సిందూర్ విజయం సాధించడంపై స్థానికులు ర్యాలీ నిర్వహించారు. గురువారం రాత్రి ఆత్మకూర్‌లో స్వామి వివేకానంద సేవాసమితి, అవోపా ఆధ్వర్యంలో వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయం నుంచి గాంధీచౌక్ వరకు జాతీయ జెండాలతో పెద్ద ఎత్తున విజయోత్సవ ర్యాలీ నిర్వహించి భారత సైనికులకు మద్దతు తెలిపారు. యావత్తు దేశప్రజలు భారత సైనికులకు రుణపడి ఉంటారన్నారు.



ఇళ్ల పేరుతో డబ్బులు వసూలు సరికాదు



తహసీల్దార్ సుగుణతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ఇప్పిస్తామని చెప్పి దళితులతో వసూలు చేసిన డబ్బులను వారికి తిరిగి ఇప్పించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సీతారాములు, మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ సుగుణను కలిసిన వారు మామిడిమాడలో జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఓ నాయకుడు ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేశారని గ్రామానికి చెందిన దళితులు రాతపూర్వకంగా సంతకాలు చేసి ఇచ్చారని తహసీల్దార్‌కు వివరించారు. అయినా ఇప్పటి వరకు అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. నిరుపేద దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో దళితుల ఇళ్ల విషయమై చెప్పిన ప్రతి విషయాన్ని, వారు రాతపూర్వకంగా ఇచ్చిన పత్రాన్ని జిల్లా అధికారులకు అందజేశామన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, యువమోర్చా అధ్యక్షుడు గోపి ముదిరాజ్, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: గ్రామాల్లో గర్భిణుల వివరాలను నమోదు చేస్తూ పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెంచేలా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేర్లు నమోదు చేయించుకున్న గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, పీహెచ్‌సీలో కాన్పులతో ప్రభుత్వం అందించే ప్రోత్సహకాలపై చైతన్యం చేయాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా వడదెబ్బ నివారణ, మిషన్ ఇంద్రధనస్సు, చిన్నారుల వ్యాధి నిరోధక టీకాలు తదితర అంశాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీహెచ్‌ఓ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు తారాశశాంక్, మైథిలి, నాగరాజు, నిహారిక, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

ఆత్మకూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యుడు బాలనర్సింహా కోరారు. స్థానిక వర్తకసంఘం భవనంలో గురువారం సీపీఐ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులను అంతమొందించేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం పెట్రోల్, డిజీల్, వంట గ్యాస్, నిత్యా వసర సరుకుల ధరలు పెంచడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, ఏఐటీయూసీ రాష్ట్రకార్యదర్శి సురేష్, నాయకులు మోష, చంద్రయ్య, శ్రీహరి, అబ్రహం, సీఎన్‌శెట్టి, రమేష్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేర్చాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ

వనపర్తిటౌన్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఇంటికి చేర్చి ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో వార్డు సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి స్థానిక నాయకులకు సూచనలు చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సాధ్యమైనంత మందికి చేర్చాలని స్థానిక నాయకులకు సూచించారు. ప్రధానమంత్రి జీవన్ బీమా యోజన పథకాన్ని, ఉచిత రేషన్ బియ్యం, అంగన్‌వాడీ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికార పథకం ఆయుష్మాన్ భారత్ పథకాలను వివరిస్తూ వాటి విశిష్టతని ప్రజలకు తెలిపనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ చిత్తారి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, సీతారాములు, పట్టణ ఇన్‌చార్జ్ బి.శ్రీశైలం, నాయకులు గోపీనాథ్ యాదవ్, సుబ్రహ్మణ్యం, లక్ష్మీ, రాములు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఏడాదికి 200 పని దినాలు కల్పించాలి



సంగినేనిపల్లిలో ఉపాధి కూలీలతో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు

అమరచింత: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఏడాదికి 200 వందల రోజుల పనిదినాలను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పాంరెడ్డిపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి దేశవ్యాప్తంగా ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శంకర్,చంద్రమ్మ, అనంతమ్మ, అలివేలమ్మ, మోహన్,గోవిందు, అహ్మద్ మియా, పెంటన్న పాల్గొన్నారు.

వీపనగండ్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసే కుట్రకు తెరలేపిందని దానిని సమిష్టిగా ఎదురుకోవాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. గురువారం సంగినేనిపల్లి గ్రామంలోని పని ప్రదేశంలో ఉపాధి కూలీలతో ఆయన సమావేశమయ్యారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చెయ్యాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల ఆంజనేయులు, కూలీలు రాజు, బాలకిష్టమ్మ, శంకరమ్మ, శాంతమ్మ, రాణిమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు సరికాదు



పాన్‌గల్‌లో డాక్టర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, ఆశా కార్యకర్తలు

వనపర్తి రూరల్: ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం ఆవరణలో జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు ఆధ్వర్యంలో ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, ఆర్ఎన్ రమేష్, సునీత, శారద, నందిమళ్ల రాములు, కవిత, శ్యామల, నారాయణమ్మ, జ్యోతి, బాలకిష్టమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని కోరుతూ కార్మిక సంఘాలు, స్వాతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్ల పిలుపు మేరకు ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆశాకార్యకర్తల ఆధ్వర్యంలో పీహెచ్‌సీ డాక్టర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో సూర్యవంశ రాము, రమేష్, శ్యామల, రేణుక, మహేశ్వరి, నాగవేణి, గోవింద, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల ఆశయాలు నెరవేరాలంటే కేంద్రాలను కార్మిక చట్టాల పరిధిలోకి తీసుకురావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ ఉద్యోగులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో సమ్మె నోటీస్ అందించారు. కార్యక్రమంలో సుగుణాబాయి, రమేష్, ఆది, కమల, ఎల్లమ్మ, లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లోఉన్న వేతనాలను ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్రకార్యదర్శి సురేష్ అన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చి ఆస్పత్రి కార్మికులకు సభ్యత్వ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్తార్, బాలరాజు, శ్రీకాంత్, అరుణ్, శైలజ, బాలకిష్టమ్మ, నాగమ్మ, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడికక్కడే భూ సమస్యల పరిష్కారం



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ పాండునాయక్

గోపాల్‌పేట: మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా కొనసాగుతున్న ఆర్ఓఆర్ కొత్త చట్టం రెవెన్యూ సదస్సులతో రైతులకు ఎక్కడికక్కడే పరిష్కారం లభిస్తుందని, రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పాండునాయక్ సూచించారు. గ్రామాల్లో కొనసాగుతున్న భూభారతి రెవెన్యూ చట్టం అమలును వీలైనంత వరకు అక్కడికక్కడే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. సక్సేషన్ దరఖాస్తులపై ప్రత్యేక చొరవ తీసుకుని దరఖాస్తు వచ్చిన వెంటనే నోటీలును అందిస్తున్నామని వెంటనే సమస్య పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అధికారులంతా అందుబాటులో ఉండి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. గురువారం ఏదుట్లలో 45 దరఖాస్తులు వచ్చాయని, వీటిని తొందర్లోనే పరిష్కస్తామని చెప్పారు.

భూభారతి చట్టంపై అవగాహన

మండలంలోని ఏదుట్లలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రజిని ఆదేశాల మేరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రఘు రైతులకు భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి చట్టంతో వారసత్వంగా వచ్చిన భూములకు నిర్ణీత గడువు 30 రోజుల్లో విచారణ పూర్తి చేసి పాసుపుస్తకం ఇస్తారన్నారు. అంతలోపు కాకుంటే ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ పూర్తవుతుందని అన్నారు. రెండంచెల అప్పీల్ వ్యవస్థ, రైతులకు ఉచిత న్యాయ సహాయం వంటి ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు.

ఏపీ పోలీసుల తీరు అభ్యంతరకరం



మదనాపురంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్ష నాయకులు



అమరచింత తహసీల్దార్ కార్యాలయం వద్ద..

సాక్షి, నెట్‌వర్క్: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ,పోలీసుల తీరుపై విలేకరులపై వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉందని జర్నలిస్టు సంఘా లు మండిపడ్డాయి.పత్రికా స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపుతోందని ఆరోపించారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సాక్షి ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు చేయడం సరైంది కాదన్నారు. కేవలం కూటమి ప్రభుత్వం ప్రోద్భలంతోనే పోలీసులు ఈ దారుణానికి ఒడిగట్టారని ఆరోపించారు.

- కొత్తకోట పట్టణంలో పత్రిక స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపుతున్న చంద్రబాబు సర్కారు వైఖరిని జర్నలిస్ట్ సంఘాలు తీవ్రంగా తప్పుబట్టాయి. గురువారం సాయంత్రం కొత్తకోట చౌరస్తాలో జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు రాములు, రవి కుమార్, చంద్రశేఖర్, సురేష్, సలాం, లక్ష్మీనారాయణ, ఖాజామైనోద్దీన్, కిషోర్, ఈశ్వర్, ధనుష్, సుధాకర్ పాల్గొన్నారు.
- గోపాల్‌పేట మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు మంగదొడ్డి కృష్ణయాదవ్, సీనియర్ జర్నలిస్టులు బాల్‌రాం, రాధాకృష్ణారెడ్డి, ప్రేమ్‌కుమార్, కురుమూర్తి తదితరులు ఏపీ పోలీసుల నిరంకుశత్వాన్ని ఎండగట్టారు.
- ఆత్మకూర్ పట్టణంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఏపీ ప్రభుత్వ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు రహ్మతు ల్లా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్,సీపీఎం మండల అధ్యక్షుడు రాజు,సీపీఐమండల అధ్యక్షుడు రాబర్ట్ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు.
- అమరచింత పట్టణంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ రవికుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో విలేకరులు ఆంజనేయులు, రఘు, సతీష్, అక్బర్, ప్రజాసంఘాల నాయకులు వెంకటేష్, ఆంజనేయులు, నారాయణ పాల్గొన్నారు.
- మదనాపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకరి విమల్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టారు.